క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యం

చొప్పదండి: సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురుకుల సొసైటీ రూపొందించిన ప్రవేశాల వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదివారం ఆవిష్కరించారు. రుక్మాపూర్ సైనిక శిక్షణ పాఠశాలలో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెస్ చార్జీలను పెంచి నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సైనిక పాఠశాల ప్రిన్సిపాల్ కాళహస్తి, బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి


రథయాత్రలో ఎమ్మార్పీఎస్ నాయకులు

రామడుగు: హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించనున్న వెయ్యి గొంతుకలు లక్ష డప్పుల మాదిగల గుండె చప్పుడు ప్రదర్శన కార్యక్రమంలో ప్రతి మాదిగ బిడ్డ పాల్గొని విజయవంతం చేయాలని కళామండలి రథయాత్ర రాష్ట్ర కోఆర్డినేటర్ రామంచ భరత్ మాదిగ పిలుపునిచ్చారు. మండలంలోని వెదిర, దేశరాజ్‌పల్లి గ్రామాలతో పాటు ఇతర గ్రామాల్లో కార్యక్రమం గూర్చి వివరిస్తూ రథయాత్ర చేపట్టారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికీ అమలు కావడం లేదని దీని సాధన కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌మాదిగ, నాయకులు తడగొండ శంకర్, కొత్తూరి రాజన్న, దొమకొండ శ్రీనివాస్, శనిగరపు హన్మయ్య, రవి, నరేష్, వినయ్, మల్లేశం, మల్లయ్య పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం


పోటీలు ప్రారంభిస్తున్న సతీశ్‌రెడ్డి

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేటలో నేచర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో రామడుగులో ఆర్‌పీఎల్ సీజన్–4 క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పోటీలను ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ కొత్త సతీష్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాజగోపాల్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు తిరుపతి, మాజీ సర్పంచ్ పంజాల జగన్‌మోహన్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ పెంచాల మల్లారెడ్డి, పలు యువజన సంఘాల నాయకులు, క్రీడాకారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు

గన్నేరువరం: గన్నేరువరంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఆదివారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. గొబ్బెమ్మలు, గంగిరెద్దులు, హరిదాసుల వేషధారణలో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు, ప్రిన్స్‌పాల్ భానుచైతన్య, ఉపాధ్యాయులు లత, మమత, సమంత, శిరీష, రేణుక, శ్వేత, లాస్య తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ నిర్మాణ పనులు నిలిపివేత

మానకొండూర్‌రూరల్: మండలంలోని పచ్చునూర్ గ్రామ చౌరస్తా సమీపంలో కొంతమంది యువకులు, నాయకులు బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహ నిర్మాణ పనులు ప్రారంభించారు. జేసీబీతో గుంత ఏర్పాటు చేయగా గ్రామంలోని కొంత మంది నాయకులు పనులను అడ్డుకొని,. అధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేస్తూ ఇబ్బంది పెడుతున్నారని విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. విగ్రహానికి స్థలం కేటాయించాలని కలెక్టర్‌కు విన్నవించామన్నారు. సంబంధిత రెవెన్యూ, ఎంపీడీవో అధికారులు విచారణ చేపట్టి విగ్రహ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

వివేకానందుడి స్ఫూర్తితో సాగాలి


హుజూరాబాద్: వివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి

సాక్షినెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో ఆదివారం స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళి అర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. వివేకానందుడి స్ఫూర్తితో యువత ముందుకు సాగాలన్నారు. ఆయన ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. స్వామి వివేకానంద ఆశయాలను ఆదర్శంగా తీసుకొని దేశఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటాలన్నారు. తనగురువు పేరుమీద రామకృష్ణమఠం స్థాపించి శిష్యుల ద్వారా దేశానికి ఎనలేని సేవలు అందించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. యువత కు ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు.కాధునిక భారత జాతీయ వాదానికి పితామహుడని పేర్కొన్నారు. జయంతి వేడుకల్లో బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


చొప్పదండి: వేడుకల్లో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ విజయలక్ష్మి, తదితరులు


శంకరపట్నం: నివాళి అర్పిస్తున్న యువజన సంఘం నాయకులు


ఇల్లందకుంట: వేడుకల్లో బీజేపీ నాయకులు


మానకొండూర్: వేడుకల్లో బీజేపీ నాయకులు


గన్నేరువరంలో స్వామి వివేకనంద జయంతి




బహుమతులు అందిస్తున్న గందె రాధిక, హుజూరాబాద్: ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు, శంకరపట్నం: ముగ్గులను పరిశీలిస్తున్న నాయకులు

ముగ్గుల పోటీలు

హుజూరాబాద్: పట్టణంలో ఆదివారం వాసవి వనితా క్వీన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం గాలిపటాలపంపిణీలో మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక పాల్గొన్నారు. ముగ్గుల పోటీలో విజేతలకు మహిళలకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ కార్యవర్గం పాల్గొన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామంలో ఆదివారం భోగి పండుగను పురస్కరించుకొని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన మహిళలకు పార్టీ మండల అధ్యక్షులు లావణ్య, సింగాపూర్ మాజీ సర్పంచ్ మంజుల, గుడిపాటి లలిత, పద్మ మహిళా సంఘం అధ్యక్షులు అన్నపూర్ణ బహుమతులు ప్రదానం చేశారు.

శంకరపట్నం: కేశవపట్నంలో ఆదివారం గాజుల నందస్ స్మారకార్థం తల్లిదండ్రులు ముగ్గుల పోటీలు నిర్వహించారు. చిందం సునీత, ఐత పద్మావతి, నేరెళ్ల శోభారాణి, కృష్ణవేణి, రాణి ముగ్గులను పరిశీలించి బాడిష పావని, గోదరి సుష్మిత, సుద్దాల అనూషను విజేతలుగా ప్రకటించారు. రిటైర్డ్ ఎంఈవో రామస్వామి బహుమతులు అందించారు. దుర్గం అక్షయ, గొల్లపల్లి ప్రవళిక కాన్సోలేషన్ బహుమతి అందుకున్నారు. పద్మశాలీ మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్ తనుకు ప్రభాకర్, మాజీ సర్పంచ్‌లు మోతుక్కూరి సమ్మయ్య, రాజకొంరయ్య, మాజీ ఉపసర్పంచ్ హన్మంతు, సత్తయ్య, ఓంకారం తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

• పోస్టర్ ఆవిష్కరణ

జమ్మికుంట: సామాజిక సేవ దృక్పథంతో పేదలకు చేయూతనివ్వాలని తల్లిదండ్రులైన అన్నారెడ్డి, పుష్పలత పేరుతో అన్నా చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసినట్లు టీపీసీసీ సభ్యుడు పత్తి కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఆయన నివాసంలో విలేకర్ల సమావేశంలో ట్రస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

• మాధవరావు సేవలు మరువలేనివి

జమ్మికుంట: మానవ హక్కులు, సామాజిక మార్పు కోసం తుది శ్వాస వరకు ఉద్యమించిన గొర్రెపాటి మాధవరావు సేవలు మరువలేనివని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో మానవ హక్కుల వేదిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించగా ఘన నివాళులు అర్పించారు.

• ఎమ్మెల్యే ఆర్థిక సాయం

జమ్మికుంట: కారు ప్రమాదంలో తీవ్రగాయాలైన నిరుపేద కుటుంబానికి చెందిన దొడ్డె రాజయ్యకు వైద్య చికిత్స కోసం హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆర్థిక సాయం చేశారు. ఓ ప్రైవేటు ఆసుపత్రికి రూ. లక్ష చెల్లించి, రూ.యాభైవేలు ఖర్చులకు అందించారు.

• దహన సంస్కారాలకు..

చొప్పదండి: పట్టణంలోని నిరుపేద కుటుంబానికి చెందిన కారంపొడి ఎల్లమ్మ (75) మృతి చెందగా రామకృష్ణ సేవా సమితి తరుపున దహన సంస్కారాలకు రూ. 5 వేల ఆర్థిక సాయం అందించారు.

• వాలీబాల్ పోటీలు ప్రారంభం

వీణవంక: వీణవంక జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో మండల స్థాయి వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు.

• క్రికెట్ టోర్నీ ప్రారంభం

తిమ్మాపూర్: మన్నెంపల్లిలో నాంపల్లి బాలరాజు, రాజు స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, తాజా మాజీ ఉపసర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్ ప్రారంభించారు.

• ఉచిత వైద్యశిబిరం

వీణవంక: మండలంలోని ఇప్పలపల్లి గ్రామంలో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. . మెడికవర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ స్థానిక ప్రజలకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందించాలనే ఉద్దేశంతో శిబిరంనిర్వహించామన్నారు.

• సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

శంకరపట్నం: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం సీఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు.

• జీతాలు చెల్లించాలి

జమ్మికుంట : గ్రామ పంచాయతీ కార్మికులకు పండుగ పూట వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందని వెంటనే జీతాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పాత వ్యవసాయ మార్కెట్ ఆవరణలో గ్రామపంచాయతీ యూనియన్ మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు.

• నియామకం

మానకొండూర్‌రూరల్: మండలంలోని పచ్చునూర్ గ్రామానికి చెందిన కంది రాజిరెడ్డిని బీజేపీ మానకొండూర్ మండల అధ్యక్షుడిగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి నియామక ఉత్తర్వులు జారీచేశారు. నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి రాజిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామానికి చెందిన ఉప్పు శ్రీనివాస్‌ను బీజేపీ కరీంనగర్ జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా నియామకం చేస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

చొప్పదండి: మండలంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని పార్టీ మండల అధ్యక్షుడు మొగిలి మహేశ్ అన్నారు. బీజేపీ అధిష్టానం సేవలను గుర్తించి మండల అధ్యక్షుడిగా నియామకం చేసినందుకు ఆదివారం పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

• సన్మానం

ఇల్లందకుంట: మండలంలోని పాతర్లపల్లి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు బైరెడ్డి రమణారెడ్డి మండల అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా మండలంలోని నాయకులు ఆదివారం మండల కేంద్రంలో ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు.

• ముందస్తు అరెస్ట్

జమ్మికుంట: ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో పట్టణానికి చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు , దళితబంధు సాధన కమిటీ సభ్యులను ఆదివారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు.

హుజూరాబాద్ : ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో కలిసి కరీంనగర్ సమావేశానికి బీఆర్ఎస్ నాయకులు వెళ్తున్నారనే సమాచారంతో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.

• బీఆర్ఎస్ ఆఫీస్‌పైదాడి హేయమైన చర్య

చిగురుమామిడి: యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్‌నాయకుల దాడి హేయమైన చర్య అని చిగురుమామిడి అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆదివారం ఖండించారు. సీఎం రేవంతర్‌రెడ్డి కనుసన్నల్లోనే దాడి జరిగిందని ఆరోపించారు.

• అదనపు వరకట్న కేసు

జమ్మికుంట: అదనపు వరకట్నం కోసం వేధింపులకు పాల్పడిన వారిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు.

• ఎరువుల దుకాణంలో చోరీ


గంగాధర: మండలంలోని మధురానగర్ చౌరస్తాలోని వెంకటేశ్వర సీడ్స్ అండ్ ఫెస్టిసైడ్స్ దుకాణంలో చోరీ జరిగింది. శనివారం రాత్రి దొంగలు రూ.లక్ష రూపాయలు తీసుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు యజమాని తెలిపాడు.

• పిచ్చికుక్క దాడిలో వ్యక్తికి గాయాలు

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన యాసర్ల ఓదెలుపై పిచ్చికుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. నడుచుకుంటూ వెళ్తుండగా దాడి చేసింది. స్థానికులు 108కి సమాచారం అందించడంతో ఈఎంటీ ఐలవేన కుమారస్వామి, పైలెట్ శ్రీకాంత్ ప్రథమ చికిత్స అందించి హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

• ఆరోగ్య పరిస్థితిపై ఆరా..

హుజూరాబాద్: డివిజన్‌లోని పలు గ్రామాలలో జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించుకున్న వ్యక్తులను ఆదివారం శంకర కంటి ఆసుపత్రి వైద్యులు వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.



శంకరపట్నం: మండలంలోని కాచాపూర్ ఎస్సీకాలనీలో చేతిపంపు మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో ఎస్సీకాలనీతో పాటు గ్రామస్తులు నీటి కోసం ఇబ్బందులుపడుతున్నారు. చేతిపంపుకు వెంటనే మరమ్మతు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
కృష్ణప్రసాద్, ఎంపీడీవో, ఫోన్ నంబర్: 9989930713

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ఆధ్యాత్మికం

వీరభద్రస్వామి ఆలయ వార్షికోత్సవాలు

గంగాధర: భక్తుల పాలిట కొంగు బంగారంగా నిలుస్తున్న మండలంలోని కోట్ల నర్సింహులపల్లి గ్రామం నందగిరి వీరభద్రస్వామి ఆలయ వార్షికోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ వంశపారపర్య పూజారి పొరండ్ల శ్రీనివాసశర్మ తెలిపారు. ఏటా జనవరిలో ఐదు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తామన్నారు. వార్షికోత్సవాల్లో అన్నదాన కార్యక్రమంతో పాటు ప్రతి నిత్యం సాంస్కృతిక కార్యాక్రమాలుంటాయని మాజీ సర్పంచు తోట కవిత, ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులు ఏర్పాటు చేశామని పూజారి శ్రీనివాసశర్మ తెలిపారు.

నేటి నుంచి జాతర

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామంలో వీరభద్రస్వామి జాతర సోమవారం నుంచి ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జాతర సందర్భంగా అగ్నిగుండాలు, బండ్లు తిరుగుట, కల్యాణం, రథయాత్ర ఉంటుందని, జాతరకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు గోదారంగనాయకులస్వామి కల్యాణం

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భోగి పండుగ సందర్భంగా గోదాదేవిరంగనాయకస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చొల్లేటి శంకరయ్య ఆదివారం తెలిపారు. కల్యాణంలో దంపతులు పాల్గొని కోరారు.

కమనీయం కల్యాణం

మానకొండూర్: మండలంలోని కొండపలకల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో గోదాదేవి రంగనాయకులస్వామి కల్యాణం ఆదివారం కన్నుల పండుగ నిర్వహించారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో ప్రతిష్ఠించి కల్యాణం జరిపించగా పూజారి నమిలికొండ రఘురామాచార్యులు, యశస్విభరద్వాజ్, భక్తులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని తాపాల లక్ష్మీనసింహాస్వామి ఆలయంలో డిసెంబర్ 16వ తేదీ నుంచి ప్రారంభమైన ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రభాత సమయంలో తిరుప్పావై పాశురాల ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 11:30 నుంచి మంచి ముత్యాల తలంబ్రాలతో శ్రీగోధారంగనాథుల తిరుకళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు.

క్రీడలతో స్నేహభావం పెంపు


పరిచయం చేసుకుంటున్న నరేందర్ రెడ్డి

తిమ్మాపూర్: క్రీడలతో శారీకదారుఢ్యం, పోటీతత్వం, స్నేహభావం పెంపొందుతాయని తిమ్మాపూర్ సర్కిల్ ఎస్సైలు తాండ్ర వివేక్, నరేశ్, రాజేశ్ అన్నారు. మహాత్మానగర్ పంచాయతీ పరిధి శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఆదివారం పోలీస్ అండ్ ప్రెస్ ఫ్రెండ్లీ మ్యాచ్ నిర్వహించారు. శ్రీచైతన్యకళాశాల డైరెక్టర్ నరేందర్‌రెడ్డి ప్రెస్ టీం కెప్టెన్ బత్తుల రాకేశ్, పోలీసు టీం కెప్టెన్ నరేశ్‌ను ఆహ్వానించి టాస్ వేశారు. రెండు మ్యాచ్‌లు నిర్వహించగా రెండింటిలో పోలీసు టీంపై ప్రెస్ టీం విజయం సాధించింది. ఈసందర్భంగా ఎస్సైలు మాట్లాడుతూ.. క్రీడా నైపుణ్యంపై అవగాహన కల్పించడానికి క్రికెట్ మ్యాచ్ నిర్వహించామని, ఇరు జట్లలోని సభ్యులు అద్భుత ప్రదర్శన కనబరిచారని, గెలిచిన ప్రెస్ టీంను అభినందించారు.

ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలు

హుజూరాబాద్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలు పట్టణ అధ్యక్షుడు మేకల తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు లావణ్య, సీనియర్ నాయకులు స్వామిరెడ్డి, హనుమాన్ టెంపుల్ చైర్మన్ శంకర్, పుష్పలత, బాబు, నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాజు, అఫ్సర్, శ్రీనివాస్, తిరుపతి, రాజుకుమార్ ఉన్నారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. యువజన కాంగ్రెస్ నాయకులు అన్నంప్రవీణ్, జిల్లెల్ల తిరుపతిరెడ్డి, సంజీవరెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఓదెలు, మహేష్, పరమేష్, కిరణ్, వేణు, మల్లేష్, పెద్ది శివ, సాయి, రాజబాబు, స్వామి, సింగిరెడ్డి గోపాల్ రెడ్డి, రమేష్, మానస, లాల్ మహమ్మద్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

వీణవంక: మండలంలోని కాంగ్రెస్ నాయకులు చింతల శ్యాంసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలకు అవకాశం కల్పించాలని, మండలంలోని నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. వెంటనే ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణతో ఫోన్‌లో మాట్లాడారని తెలిపారు. వెంట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, అజయ్, మహేశ్, అనిల్‌రెడ్డి, కిశోర్, మోహన్ రెడ్డి, సదయ్య, వెంకన్న, రవీందర్, సమ్మిరెడ్డి, వీరారెడ్డి, చిరంజీవి, సాయిరెడ్డి ఉన్నారు.



విద్యార్థుల క్షేత్ర పర్యటన

మానకొండూర్: మానకొండూర్ బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పీఎంశ్రీ పథకంలో భాగంగా శని, ఆదివారం క్షేత్ర పర్యటనకు వెళ్లారు. బాసర, గోదావరినది, బాసర వైజ్ఞానిక విశ్వవిద్యాలయం, నిర్మల్ కొయ్య బొమ్మల పరిశ్రమ, కుంటాల జలపాతం, జల విద్యుత్ కేంద్రం, శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ సందర్శించారు. క్షేత్ర పర్యటనతో విద్యార్థులు వివిధ ప్రదేశాలపై అవగాహన పెంచుకుంటారని ఉపాధ్యాయుల తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి. శ్రీనివాస్, ఉపాధ్యాయ విద్యార్థులు పాల్గొన్నారు.


అర్నకొండ జెడ్పీహెచ్ఎస్‌లో 2007-08 పదో తరగతి విద్యార్థులు


సైదాపూర్: వెన్నంపల్లి జెడ్పీహెచ్ఎస్ 1997-98 విద్యార్థులు


హుజూరాబాద్: చదువు చెప్పిన టీచర్లతో 2004-05 విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చొప్పదండి/హుజూరాబాద్/సైదాపూర్: చొప్పదండి పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ 2000–01, అర్నకొండ జెడ్పీహెచ్ఎస్ 2007–08, హుజూరాబాద్ పట్టణంలోని ఉషోదయ స్కూల్‌లో 2004–05, సైదాపూర్ మండలం వెన్నంపల్లి జెడ్పీహెచ్ఎస్ 1997–98 పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆయా పాఠశాలల ఆవరణలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులందరూ ఒకచోట చేరి ఒకరికొకరు యోగక్షేమాలను తెలుసుకుంటూ చదువుకున్న రోజులనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాతో సత్కారించారు.


చొప్పదండి పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ 2000-01 పదో తరగతి పూర్వ విద్యార్థులు